

# మాటా మంతీ

## - సాయి పద్మ



# సోషల్ డిజేబిలిటీస్

**ఈ నెల** నాకు విపరీతమైన పని. క్రితం నెలలో, మా వర్క్ బీ బీ సి వాళ్ళు కవర్ చేసారు. ఒక రెండు రోజుల షూటింగ్.. నేను పని చేస్తున్న గిరిజన గ్రామాలన్నీ తిరగటం నాకు అలవాటే అయినా, ఒకేసారి ఎప్పుడూ వెళ్ళలేదు. పని పెరిగి, కొత్త హేమ్లెట్స్ అన్నీ.. మా టీం వాళ్ళే వెళ్ళటంతో, నా ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగా ఉండటంతో, వెళ్ళలేదు. మొన్న వెళ్లి చూద్దునా.. వొక వైపు సంతోషం , మరో వైపు బాధ. సంతోషం కొంచమన్నా చేస్తున్నాం..పిల్లలు బాగున్నారు అని. బాధ ఇంకా చాలా బేసిక్ అవసరాలైన , కూడు, గూడు.. గుడ్డ ఇలాంటి వాటికోసమే పని చేస్తున్నాం అని. మేము పనిచేసే ట్రైబల్ గ్రామాలు చాలా వెనుకపడినవి. ఎరుక, గదబ, కొండ దొర, మేదర సంచార జాతులు నివాసం ఏర్పరచుకొన్న గ్రామాలవి. గ్రామం అనేకంటే, వొక వలస అనవచ్చు. అందుకే అక్కడ వూళ్ళ పేర్లు కూడా వలస అనే ఉంటాయి.. ఉదాహరణకి, ఉయ్యాడ వలస, గదబ వలస, సారావాని వలస ఇలా.. ఇలాంటి ఒక పది ట్రైబల్ హేమ్లెట్స్ లో పని చేస్తున్నాం మేము. పని అంటే, మా ప్రాజెక్ట్ ఆ పిల్లలని చదివిస్తుంది, అక్కడి వాలంటీర్ల ని పెట్టి. ముఖ్యంగా టీచర్ వాళ్ళ హేమ్లెట్ కి చెందినవారే అయి ఉంటారు. వాళ్ళ భాష, వాళ్ళ సంస్కృతి, వ్యవసాయ పద్ధతులు పిల్లల చేతే , స్టడీ చేయిస్తాం. ఎందుకంటె, చదువు నేర్చిన వాళ్ళ పిల్లలు వాళ్లకి చెబుతుంటే, వాళ్ళు విని ఆచరించే అవకాశం ఎక్కువ. ఈ ప్రాజెక్ట్ మేము గత తొమ్మిదేళ్ళు గా చేస్తున్నాం. రెండు వేల పద్దెనిమిది కి పది సంవత్సరాలు పూర్తి అవుతాయి. ఆ హేమ్లెట్స్ లోకి, మేము కాకుండా మొదట అడుగు పెట్టిన మీడియా బీ బీ సి. ఇందుకు వాళ్ళకి నిజంగా ధన్యవాదాలు. వాళ్ళు చేసిన స్టోరీ చదవాలంటే/చూడాలంటే ఇదిగో ఇక్కడ చూడవచ్చు.

https://www.bbc.com/telugu/india-41563343- ఇది తెలుగు లో

http://www.bbc.com/news/av/world-41552885/how-a-polio-survivor-is-educating-india-s-rural-children- ఇది ఇంగ్లీష్ లో

మా, ఈ చిన్ని చిన్ని హేమ్లెట్స్ తాలూకా కథ ఇప్పుడు బీ బీ సి, 100 మంది అత్యంత ప్రతిభావంతమైన మహిళల సరసన నన్ను నిలిపింది. నేనేదో గొప్పగా చేసాననో, ఈ రికగ్నిషన్ వచ్చినందుకు నా సంతోషమో కాస్త సేపు పక్కన పెడితే.. !! ఈ ఇంటర్వ్యూ లో నేను చెప్పిన మాట నేను నిత్యం అనుకుంటూ ప్రాక్టీస్ చేస్తూ ఉంటాను.

"I, identify myself with the communities..I may be physically disabled but they are socially, culturally disabled "

"ఈ సోషల్ డిజేబిలిటీస్ ఏంటి కొత్తగా?" అని అడిగారు చాలా మంది , వాళ్ళకోసమే ఈ నెల ఈ కాలమ్...

సోషల్ డిజేబిలిటీస్ అంటే , పేదరికం, అవిద్య, నిస్సహాయతనం. సాంఘిక వైకల్యం అంటే, వొక చిన్ని పాప, మూడు పూటలా అన్నం తినోచ్చని ఆయా ఉద్యోగం కోసం కనటం , లేత వయసులో జరిగిన పెళ్ళితో, తప్పనిసరి మైగ్రేషన్ వెళ్ళాల్సి వచ్చి, జీవితం, సంసారం అంతా కడుతున్న బిల్డింగ్స్ దగ్గరనే ఉంది, ముప్పై ఏళ్ళకే జీవితం అంతా అయిపోవటం

సోషల్ డిజేబిలిటీ అంటే, హాస్టల్ లో ఉన్నా, తండ్రి తాగి చూడటానికి వస్తాడేమో అని భయపడటం. ఇలా చెప్పుకుంటూ పోతే ఆడపిల్లగా బ్రతకటం కూడా వొక్కోసారి, సాంఘిక వైకల్యం అనిపిస్తుంది.

ఇన్ని విషయాల మధ్య, గొప్పగా అనిపించే విషయం ఏంటంటే.. గిరిజన తాండా లో పుట్టి, పెళ్లిని తప్పించుకొని, నానా కష్టాలూ పడి చదువుకున్న అమ్మాయి.. పీ హెచ్ డీ కి అప్లై చేస్తూ కూడా, ఇంగ్లీష్ సరిగ్గా రానందుకు బాధపడుతుంటే.. నేను చెప్పాను,

“చూడు.. నువ్వు ఎదుర్కొన్న జీవితం ముందు ఇంగ్లీష్ ఎంత ..? నాకు రాదు అన్న వైకల్యపు ఆలోచన వద్దు. ఎలా చేయగలను?? అని ఆలోచించు , నీకే కొత్త మార్గాలు దొరుకుతాయి” అంటే..

“ రెండు నెలల్లో చూడండి మేడం.. ఇంగ్లీష్ కూడా ఒక పట్టు పడతాను” అంది.. !!

ability ఇన్ disability అంటే ఏంటో నాకు మరోసారి అర్ధం అయింది.

ఇందులో ఇచ్చిన బీ బీ సి న్యూస్ క్లిప్పింగ్స్ చూడండి. మీకు తెలిసిన వాళ్ళతో పంచుకోండి. ఇది వొక చాలెంజ్ . మా ప్రాజెక్ట్ ని ఈ చాలెంజ్ లో ముందు వరుసలో నిలపండి. ఏమో.. ఎంతోమంది తమ తమ సోషల్ డిజేబిలిటీ చట్రాలను దాటి అక్షర దీపాలవుతారేమో..!!

Post your comments